క్లుప్తంగా

ప్రారంభోత్సవానికి రెడీ


నూతన మండల పరిషత్ కార్యాలయం


పులిచెర్ల(కల్లూరు): మండల కేంద్రమైన పులిచెర్లలో రూ 2.65కోట్లతో మండల పరిషత్, తహసీల్దారు కార్యాలయాల నిర్మాణం పూర్తయింది. ఒకే ప్రాంగణలో వీటిని నిర్మించారు. వీటిని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి చేతుల మీదుగా వీటిని ప్రారంభించనున్నట్లు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి పేర్కొన్నారు.

రోగులకు పండ్లు, పాలు పంపిణీ


పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న ఇస్మాయిల్, హఫీజ్

పుంగనూరు: మిలాదున్‌నబి పండుగ పురస్కరించుకుని పట్టణంలోని ఫలాహ్ జమాతే ఇస్లామిక్ హింద్ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు గురువారం పండ్లు, పాలు, రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు ఇస్మాయిల్, హఫీజ్ ఆధ్వర్యంలో 310 మందికి వీటిని అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు, న్యాయవాది జహూర్‌బాషా, ఏజాజ్, ఉస్మా, షఫి, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. కల్యాణోత్సవం


కల్యాణోత్సవ పూజల్లో స్వామి వారు

చిత్తూరు రూరల్: నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో గురువారం శ్రీకంచి కామాక్షి ఏకాంబరేశ్వరస్వామి కల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. తొలుత షిరిడీ సాయినాథుని జన్మ నక్షత్ర పూజలను ఘనంగా చేశారు. తర్వాత స్వామి ఉత్సవ విగ్రహాన్ని విశేషంగా అలంకరించి కల్యాణ వేదికపై ఆశీనులు చేశారు. హోమ పూజల అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణోత్సవ ఘట్టాన్ని వేదపండితులు పూర్తి చేశారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు పసుపు, కుంకుమ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీకేబాబు, గుణశేఖర్, మాలిని తదితరులు పాల్గొన్నారు.


ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ


బాధితునికి చెక్‌ను అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్, ఎంపీపీ, నాయకులు

యాదమరి: మండలంలోని ముద్దురామాపురానికి చెందిన సంజీవిగౌడకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ.1.50లక్షల చెక్‌ను జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్‌బాబు అందజేశారు. సంజీవిగౌడ్ ఆరోగ్య పరిస్థితిని, వైద్య ఖర్చులను స్థానిక సర్పంచ్ దయానందరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ సహకారంతో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు విన్నవించారు. ఆయన వెంటనే స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి రూ.1.50 లక్షలు మంజూరు చేయడంతో బాధితునికి గురువారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'నవోదయ'కు ఎంపిక


నవోదయకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: తమ స్కూలు విద్యార్థులు ఐదుగురు జవహర్ నవోదయ పాఠశాలకు ఎంపికయ్యారని స్థానిక కృష్ణారెడ్డి శ్రీచైతన్య చిల్డ్రన్స్ అకాడమి ప్రిన్సిపల్ భాస్కర్‌రెడ్డి గురువారం తెలిపారు. తొలి విడతలో 15 మంది ఎంపికవగా, రెండవ విడతలో సాయిదీక్షిత్‌రెడ్డి, మేఘనరెడ్డి, హర్ష, రుపేష్, భవిత ఎంపియ్యారని చెప్పారు. వారిని అభినందించారు.

జోరుగా.. హుషారుగా..


రాంపల్లెలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించిన మంత్రి


పాలెంపల్లెలో మొక్కలు నాటుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్


బసివినాయునిపల్లెలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

పుంగనూరు: పుంగనూరు మండలంలో గురువారం పలుచోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బిజీ..బిజీగా పర్యటించారు. మొత్తం 26 అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవాలు చేశారు. వీటిలో సచివాలయాలు, వైఎస్సార్‌హెల్త్ క్లినిక్స్, రైతు భరోసా కేంద్రాలు, వాటర్ ప్లాంట్లు మొదలైనవి ఉన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయన విరామం తీసుకోకుండా జోరుగా..హుషారు పర్యటించారు. మంత్రి పర్యటనతో అధికారుల బృందం ఉరుకులు పరుగులు తీసింది. పలు సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేలా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు ఉండడంతో ఇంతటి అభివృద్ధి గత ప్రభుత్వాల పాలనలో ఎన్నడూ తాము చూడలేదని ప్రజలు ఆనందంగా చెప్పడం కనిపించింది. కార్యక్రమాల్లో మంత్రితోపాటు చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తదితరులు మాట్లాడారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వినాయక పూజల్లో పాల్గొన్న మంత్రి

తూర్పు మొగశాలలో వినాయక చవితి రోజున ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పూజలు చేశారు. ప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ప్రభు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ

మున్సిపల్ కౌన్సిలర్ యువకుమారి కుటుంబ సభ్యులను మంత్రి పెద్దిరెడ్డి పరామర్శించారు. గత వారం కౌన్సిలర్ భర్త శంకర్‌రాజు అనారోగ్యంతో మృతి చెందాడు. మంత్రి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

బాబు అరెస్ట్‌తో సంబంధం లేదు : ఎంపీ

అవినీతికి పాల్పడిన చంద్రబాబు అరెస్ట్ విషయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప స్పష్టం చేశారు. పుంగనూరు సభలో ఎంపీ మాట్లాడుతూ, అవినీతి అక్రమాలపై కేంద్ర సంస్థలు పకడ్బందీగా దర్యాప్తు చేసి, కేసులు సీఐడీకి అందజేశాయన్నారు. వాటిని అమలు చేయడం సీఐడీ నేరమా? అని ప్రశ్నించారు. ఎల్లో మీడియా చంద్రబాబు అక్రమాలు ఇకనైనా గుర్తించి వాస్తవాలు ప్రజలకు తెలియజేయాలని హితవు పలికారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. ప్రజలు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని రెండవసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. సర్పంచ్ ఆంజప్ప, మాజీ ఎంపీపీ నరసింహులు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, సచివాలయల కన్వీనర్ కొత్తపల్లి చెంగారెడ్డి, వైఎస్సార్ సీపీ కార్యదర్శులు చంద్రారెడ్డి యాదవ్, దేశిదొడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

30 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

పెద్దపంజాణి: మండలంలో ఈ నెల 30 నుంచి వచ్చే నెల 24వ తేది వరకు అన్ని పంచాయతీల్లో ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అబ్దుల్ రహీం గురువారం తెలిపారు. 30న రాజుపల్లె, 3న కోగిలేరు, 4న అప్పినపల్లె, 5న రాయలపేట, 6న శ్రీరామాపురం, 7న కొలత్తూరు, 9న తులశమ్మగుడి, 10న నాగిరెడ్డిపల్లె, 11న ముత్తుకూరు, 12న పెద్దకాప్పల్లె, 13న పెద్దవెలగటూరు, 16న తుర్లపల్లె, 17న అమ్మరాజుపల్లె, 18న వీరప్పల్లె, 19న శంకర్రాయలపేట, 20న చలమంగళం, 21న నిడిగుంట, 24 రాయలపేట(కమ్మపాళ్యం)లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పులిచెర్ల మండలంలో..

పులిచెర్ల(కల్లూరు): ఈనెల 30 నుంచి వచ్చేనెల 12వ తేదీ వరకు మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని కల్లూరు పీహెచ్‌సీ మెడికలాఫీసర్ డాక్టర్ జానకీరావు తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీలలో రెండు బృందాలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాయని తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జ్వరాల విజృంభణ..బోనమందలో వైద్య శిబిరం

- తాగునీరు కలుషితమై జ్వరాలు
- ట్యాంకర్లతో తాగునీరు సరఫరా
- డీఎంహెచ్‌ఓ ప్రభావతి వెల్లడి


గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతి దేవి, డీపీఓ లక్ష్మి

సోమల: మండలంలోని పేటూరు పంచాయతీ బోనమందలో జ్వరాలు విజృంభించాయి. అధికారుల దృష్టికి ఇది వెళ్లడంతో వారి ఆదేశాల మేరకు వైద్యాధికారులు సోనియా, బాలాజి మూడు రోజుల నుంచి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ప్రజలను పరీక్షించి మందులు అందజేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ నేపథ్యంలో గురువారం డీఎంహెచ్‌ఓ ప్రభావతి దేవి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి గ్రామాన్ని సందర్శించారు. జ్వరాల విజృంభణకు కారణాలేమిటో ఆరా తీశారు. 45 నుంచి 50 మంది వరకు జ్వరాలతో బాధ పడుతున్నట్లు తెలుసుకున్నారు. వారందరికీ చికిత్స చేయడంతోపాటు మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు చేశారని, అయితే ఎవరూ వాటి బారిన పడలేదని తేలిందని డీఎంహెచ్‌ఓ చెప్పారు. తాగునీరు కలుషితమై జ్వరాలు వస్తున్నట్లు తెలిసిందని, ఆ నీటి శాంపిల్స్ సేకరించి, ల్యాబ్‌కు పంపినట్టు చెప్పారు. ల్యాబ్ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని, అంతవరకు గ్రామ సర్పంచ్‌తో మాట్లాడి ట్యాంకర్లతో తాగునీటిని అందిస్తామన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని ప్రజలకు సూచించారు. ఇక్కడున్న ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి వచ్చే నీటిని ఇతర అవసరాలకు వాడుకోవాలని, ఈ నీటిని తాగరాదని సూచించారు.అనంతరం గ్రామంలో పారిశుద్ధ్యం పనులను ముమ్మరంగా చేయాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు.కార్యక్రమంలో ఈఓపీఆర్డీ లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శులు మసూదా బేగం, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు


యాంటీ ర్యాగింగ్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ క్రిష్ణారావు

గుడుపల్లె: వైద్య విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పీఈఎస్ వైద్య కళాశాల ప్రిన్సిపల్ హెచ్ఆర్ క్రిష్ణారావు హెచ్చరించారు. గురువారం పీఈఎస్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ సమావేశం నిర్వహించారు. 2023–24 మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ తరగతులు త్వరలో ప్రారంభం అవుతాయని, సీనియర్ విద్యార్థులు అందరితో స్నేహ భావంతో కలిసి ఉండాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడి కెరియర్‌ను నాశనం చేసుకోరాదని హితోక్తులు పలికారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ బాబు, మెడికల్ సూపరింటెండెంట్ సుబ్రమణ్య వైస్ ప్రిన్సిపల్ ఆర్.సుబ్బారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో పూజలు


అనంతపద్మనాభస్వామి పండుగ పూజల్లో భక్తులు

బైరెడ్డిపల్లె: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో గురువారం శ్రీ అనంత పద్మనాభస్వామి చిత్రపటానికి భక్తిప్రపత్తులతో పూజలు చేశారు. అర్చకులు రామక్రిష్ణమాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. బైరెడ్డిపల్లెకు చెందిన పరిపాటి వంశస్థులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తి ప్రపత్తులతో వరసిద్ధునికి వేదసద్వశం


అలంకార మండపంలో వేదసద్వశం నిర్వహిస్తున్న వేదపండితులు

కాణిపాకం(యాదమరి): స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలోని అలంకార మండపంలో గురువారం వేదపండితులు భక్తి ప్రపత్తులతో స్వామివారికి వేదసద్వశం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల అనంతరం స్వామివారికి వేదపండితులు రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదంతోపాటు శుక్లయజుర్వేదాలతో రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల నుంచి 30 మంది వేద పండితులు స్వామివారికి వేదసద్వశం చేశారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు వేద పండితులకు ప్రత్యేక స్వామివారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు. కాణిపాకం ఆలయానికి అన్ని ప్రధాన ఆలయాల నుంచి రావడం చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అర్చక వేదపండితులు పాల్గొన్నారు.


హాజరైన ఆలయ చైర్మన్, ఈఓ దంపతులు

కోలాహలంగా నిమజ్జనం


నిమజ్జనానికి తరలివెళుతున్న గణేశుడు

పెద్దపంజాణి: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని రాయలపేట పంచాయతీ చిలకపుత్తూరులో గురువారం నిమజ్జనోత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ఉదయం పూజలు చేశారు. మధ్యాహ్నం యువకులు కేరింతలు కొడుతూ మండపం వద్ద ఏర్పాటు చేసిన నీటి ఉట్లను పగలకొట్టారు. అన్నదానం చేశారు. తర్వాత వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌పై కొలువు దీర్చి, మేళతాళాలతో బాణసంచా మోత నడుమ ఊరేగింపుగా తీసుకువెళ్లి సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ, వైఎస్సార్ సీపీ నాయకులు మునిరాజ, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పలమనేరు: పట్టణంలోని పలు వినాయకుడి విగ్రహాలను గురువారం నిమజ్జనం చేశారు. స్థానిక రాధాబంగ్లా, 19 వార్డు, మదనపల్లె రోడ్డుల్లోని బొజ్జ గణపయ్యలను నిర్వాహకులు మేళతాళాలు, డప్పులు, డీజేల హోరు మధ్య రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేస్తూ నిమజ్జనానికి తరలించారు. స్థానిక ట్రాన్స్‌కో సిబ్బంది ముందస్తు జాగ్రత్తగా కరెంట్ సరఫరాను నిలుపుదల చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ కొన్ని చోట్ల యువకుల మధ్య గొడవలు చోటు చేసుకున్నాయి.


పలమనేరు: నిమజ్జనానికి తరలుతున్న వినాయకుని ప్రతిమలు

పట్టణాభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష


కౌన్సిలర్లతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: పట్టణాభివృద్ధిపై గురువారం స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ పార్టీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వచ్చే నెలలో పట్టణంలోని అన్ని సచివాలయాల పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.3.6 కోట్లను మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని విజయమే లక్ష్యంగా కౌన్సిలర్లందరూ పని చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. సమీక్షలో పట్టణంలోని కౌన్సిలర్లు పాల్గొన్నారు

భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం


భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ నితిన్‌రెడ్డి

రామకుప్పం: మండలంలోని బందార్లపల్లె పంచాయతీ నెర్నెల్లి గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను గురువారం జెడ్పీటీసీ నితిన్‌రెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నెర్నెల్లిలో పర్యటించినప్పుడు గ్రామస్తులు భూగర్భ డ్రైనేజీ పనులను చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఆయన జీజీ ఎంపీ నిధులను మంజూరు చేశారు. స్థానిక సర్పంచ్ రాజగోపాల్ సుమారు రూ.5 లక్షలతో ఈ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, ప్రచార కార్యదర్శి కేశవ రెడ్డి, మండల పార్టీ మాజీ కన్వీనర్ కృష్ణారెడ్డి వార్డు సభ్యులు ఈశ్వరమ్మ, సచివాలయ కన్వీనర్ కాంతమ్మ, బాబురెడ్డి పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్య శిబిరం

పలమనేరు: పట్టణంలో గుడియాత్తం రోడ్డులోని భవిత కేంద్రంలో నియోజకవర్గంలోని ప్రత్యేక అవసరాల పిల్లలకు శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఎంఈఓ లీలారాణి గురువారం తెలిపారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి ఈ శిబిరం నిర్వహిస్తారని, నియోజకవర్గంలోని 18 ఏళ్లలోపున్న ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీరికి ప్రభుత్వం ద్వారా అవసరమైన పరికరాలను అందజేస్తారని తెలిపారు. శిబిరానికి హాజరయ్యేవారు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు, 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను తీసుకురావాలన్నారు. అవసరం బట్టి ఎంపిక చేసిన ప్రత్యేక ప్రతిభావంతులకు ట్రై సైకిళ్లు, వీల్‌ఛైర్స్, రొలేటర్లు, ఎంఆర్ కిట్, వినికిడి యంత్రాలు, క్రైచర్స్ మొదలైన ఉపకరణాలను తర్వాత కాలంలో అందజేస్తామన్నారు. దీనికి సంబంధించి ఇతర వివరాల కోసం 9885377508 (మంజేశ్వరి) సెల్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

వాహనాల వేలం : రూ.11.68 లక్షల ఆదాయం


పలమనేరు: వాహనాలను వేలం వేస్తున్న సెబ్ అధికారులు

పుంగనూరు: పట్టణంలోని పోలీస్‌స్టేషన్, ఎస్ఈబీ పోలీస్‌స్టేషన్‌లో వాహనాల వేలంలో రూ.4.59 లక్షలు ఆదాయం లభించింది. గురువారం ఎస్ఈబీ ఏఈఎస్ శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఎస్ఈబీ స్టేషన్‌లో 11 వాహనాలను వేలం వేయగా 8 వాహనాలు కొనుగోలు చేశారు. వీటి ద్వారా రూ.1.60 లక్షలు ఆదాయం లభించిందని సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. అలాగే పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో 12 వాహనాలను వేలం వేయగా రూ.2.99 లక్షలు ఆదాయం లభించినట్లు ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు. వేలం ద్వారా లభించిన సొమ్మును ప్రభుత్వానికి జమ చేసినట్లు చెప్పారు.

పలమనేరులో..

పలమనేరు: వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను గురువారం పట్టణంలోని సెబ్ కార్యాలయంలో సెబ్ సూపరింటెంటెండెంట్ బాబు శ్రీధర్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం వేశారు.మొత్తం 22 వాహనాలను వేలం వేశామని, తద్వారా రూ.7.09 లక్షలు ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్టు సెబ్ సీఐ ఎల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

టైర్ పంక్చరై అదుపు తప్పిన టూరిస్ట్ బస్సు

- టిప్పర్‌ను ఢీకొనడంతో ప్రయాణికులకు స్వల్పగాయాలు
- అదృష్టవశాత్తు తప్పిన పెను ప్రమాదం


రోడ్డు ప్రమాదంలో ముందరి భాగం ధ్వంసమైన టూరిస్ట్ బస్సు

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరు చెరువుపై పలమనేరు– గుడియాత్తం మార్గంలో ఎదురెదురుగా రెండు వాహనాలు గురువారం ఢీకొన్నాయి. రెండు వాహనాలు ఢీకొన్నప్పటికీ అదృష్టవశాత్తు అవి చెరువు గట్టుపై నిలబడ్డాయి. ఒకవేళ చెరువులోకి పడి ఉంటే పెనుప్రమాదమే జరిగేదని ప్రయాణికులు చెప్పారు. ఈ ప్రమాదంలో టూరిస్ట్ బస్సులోని కొందరికి స్వల్పగాయాలు మినహా ఎవరికీ ఏం కాలేదు. పట్టణ సమీపంలో జరుగుతున్న ఎక్స్‌ప్రెస్ హైవే పనులకోసం మట్టి లోడుతో టిప్పర్ పెంగరగుంట నుంచి కట్టపై వస్తుండగా గుడియాత్తం వైపు యాత్రికులతో వెళుతున్న బస్సు టైరు పంక్చరై, అదుపు తప్పి ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొంది. రెండు వాహనాల ముందరి భాగాలు నుజ్జు అయ్యాయి.

భూముల ధరలకు బూమ్..బూమ్..!


రొంపిచెర్ల క్రాస్‌లో చేస్తున్న జాతీయ రహదారి పనులు

రొంపిచెర్ల: జాతీయ రహదారిలో మండలం సరిహద్దులోని మటోళ్లపల్లె నుంచి రాజువారిపల్లె వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న భూముల ధరలకు రెక్కలొచ్చాయి. గతంలో రూ.10 లక్షల నుంచి 20 లక్షలు పలికిన ధరలు ఇప్పుడు కోట్లు పలుకుతున్నాయి. నేషనల్ హైవే పనులు వేగంగా చేస్తుండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను హైవేకు ఇరువైపులా ఉన్న భూములపై పడింది. పట్టా భూములు ఎకరా రూ. కోటి నుంచి కోటి 50 లక్షల వరకు, అలాగే డీకేటీ భూములు కూడా ఎకరా రూ50 లక్షల నుంచి 75 లక్షల వరకు కొనుగోలు చేయడానికి సిద్ధమని రైతులకు ఆఫర్ ఇస్తున్నట్లు తెలియవచ్చింది. రొంపిచెర్ల క్రాస్ రోడ్డులోని పులిచెర్ల రోడ్డు నుంచి గంగా దాబా వరకు ఫ్లైఓవర్ వస్తుందని ఉద్దేశంతో అక్కడ భూముల కొనుగోలుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. అయితే పులిచెర్ల రోడ్డు నుంచి పీలేరు వైపు రెండు కిలోమీటర్ల దూరంలో రెండు ప్రైవేటు కల్యాణ మండపాలు, రెండు హోటళ్లు, ఆదర్శ పాఠశాల ఉండడంతో పాటు నూతనంగా ఒక ప్రైవేటు కళాశాల నిర్మాణానికి పీలేరుకు చెందిన ఒక పాఠశాల యాజమాన్యం విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా భూమిని కొనుగోలు చేసింది. దీంతో రియల్ వ్యాపారులు అ మార్గంలో భూముల కొనుగోలుకు ముందుకు వస్తున్నట్లు తెలిసింది. గతంలో ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు పనికి రావని అనుకున్న లబ్ధిదారులకు నేషనల్ హైవే వలన ఒక్కసారిగా భూముల ధరలు పెరగడంతో వీటికి కూడా మంచి డిమాండ్ వచ్చింది. దీంతో గతంలో ఇళ్ల పట్టాలు తీసుకుని వదిలేసిన వారందరూ ఇప్పుడు పరుగులు తీస్తున్నారు. భూములకు ఒక్కసారిగా ధరలు రావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.